క్లుప్తంగా

నేడు గవర్నర్‌ను కలవనున్న వైఎస్సార్‌టీపీ నేతలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యల పరిష్కారం కోరుతూ నేడు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైని కలవనున్నట్లు వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ భూక్యా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ట్రైబల్ యూనివర్సిటీ, ఏజెన్సీల్లో పలు జీవోల అమలు సక్రమంగా జరగడం లేదని ఆరోపించారు. వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల సూచనల మేరకు జిల్లా సమస్యలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సత్యనారాయణ

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారి నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు నూతనంగా ఏర్పాటు చేయనున్న సీసీరోడ్డు పనులను శనివారం మండల ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఈర్ల సత్యనారయణ, మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్ హుస్సేన్, ఎంపీటీసీలు సోహెల్ అహ్మద్, తుకారాం, చీలపెల్లి సర్పంచ్ యాదగిరి బ్రహ్మయ్య, ఉపసర్పంచ్ తోట మహేష్, నాయకులు చునార్కర్ ఉమాజీ, అఖిల్ అహ్మద్, కారం నాని, మల్కరి ప్రసాద్, ఆమేర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్టు, విడుదల



అరెస్టయిన నాయకులు

కెరమెరి: ప్రగతి భవన్ ముట్టడికి కాంగ్రెస్ పార్టీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచికత్తుపై మధ్యాహ్నం విడుదల చేశారు. అరెస్టయిన వారిలో సుదర్శన్, గిడ్డప్ప, బాబు, రౌఫ్ తదితరులు ఉన్నారు.

ఆరె కుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

సిర్పూర్(టి): మండల ఆరె కుల సంఘం క్యాలెండర్‌ను శనివారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహఆవరణలో తహసీల్దార్ జమీర్ చేతుల మీదుగా ఆరెకుల సంఘం నాయకులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కుల సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ చేపట్టామన్నారు. జనవరి 12న జీజాబాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడు చన్కపురె శంకర్, గౌరవ అధ్యక్షుడు ఎల్ములే శంకర్, నాయకులు మోహన్, శ్యాంరావ్, మారుతి, కిషోర్, మధుకర్, మోహన్, రమేష్, నందాజి, దివాకర్, కాశినాథ్, భగవాన్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘం భవనంలో శనివారం సంఘం మండల నాయకులు ఆరె సంఘం నూతన సంవత్సర కాలసూచికను విడుదల చేశారు. సంఘం మండల అధ్యక్షుడు ధనుర్కర్ వసంత్‌రావు మాట్లాడుతూ ఆరె కులస్తులు శివాజీ మహారాజ్ అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు నారులే హనుపటేల్, ప్రధాన కార్యదర్శి రోహినే ఆనంద్‌రావు, నాయకులు బండు, శ్యాంరావు, ఎల్ములే మధుకర్, బిక్కు, నాగభూషణం, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి



అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో

తిర్యాణి: విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈవో వెంకటేశ్వర స్వామి అన్నారు. శనివారం మండలంలోని సుంగాపూర్, గుడిపేట్, మోహిందా, రాళ్ల కన్నెపెల్లి ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని క్రమం తప్పకుండా నిర్వహించడంతో పాటు అభ్యసన సామర్థ్యాలు ఎప్పటికప్పుడు సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

విజ్ఞాన విహారయాత్ర!



- ఉత్తేజం నింపుతున్న విహారయాత్రలు
- ఉల్లాసంగా గడుపుతున్న విద్యార్థులు

సండే స్పెషల్

వినోదం తోపాటు విజ్ఞానం..

కెరమెరి: ఏడాదంతా పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు వినోదం, కాలక్షేపం, ఆనందం పంచాలనే ఉద్దేశంతో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రాచుర్యం పొందిన ప్రదేశాలకు విహారయాత్రలకు తీసుకెళ్తున్నారు. ఆయా ప్రదేశాల ఔనత్యాన్ని, చరిత్రను విద్యార్థులకు తెలియజేస్తూ వారిలో పరిపూర్ణ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తున్నారు. విహారయాత్రలు విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపుతున్నాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఇటీవల మండలంలోని గోయగాం, సుర్దాపూర్, ఇందాపూర్, తదితర పాఠశాలలకు చెందిన విద్యార్థులు విహారయాత్రలకు వెళ్లారు.

విహారయాత్రలు విద్యార్థుల్లో వినోదంతో పాటు విజ్ఞానాన్ని పెంచుతున్నాయి. పాఠ్య పుస్తకాలు, పత్రికల్లో చదువుకున్న, టీవీలు, సినిమాల్లో చూసిన ప్రదేశాలు, కట్టడాలు ప్రత్యక్షంగా వీక్షించడం వారిలో గొప్ప అనుభూతిని కలిగిస్తున్నాయి. మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో విహారయాత్రలకు వెళ్లారు. ఈనేపథ్యంలో విజ్ఞాన విహారయాత్రలకు వెళ్లేవారి సంఖ్య క్రమక్రమంగా పెరుగుతుంది. ఉమ్మడి జిల్లాలోని బాసర సరస్వతి ఆలయం, కడెం ప్రాజెక్టు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, కుంటాల జలపాతం, కుమురం భీం మ్యూజియం, కొయ్యబొమ్మల తయారీ తదితర ప్రాంతాలు విహారయాత్రలకు నెలవుగా మారాయి.

సరస్వతి ఆలయం సందర్శించాం



ఉత్తీర్ణత సాధించాలని, మంచి గ్రేడు సాధించేందుకు శక్తిని ప్రసాదించమని బాసరలోని చదువుల తల్లి సరస్వతి దేవికి మొక్కుకున్న. బాసర ఆలయం ఎంతో అనుభూతిని కలిగించింది. గోదావరిలో పడవ ప్రయాణం కూడా చేశాం.

– ఎస్. జహ్నవి. 10వ తరగతి, గోయగాం

కొయ్యబొమ్మల తయారీ అద్భుతం



నిర్మల్‌లోని కొయ్యబొమ్మలు ఎంతో అద్భుతంగా ఉన్నాయి. వాటిని ఎలా తయారు చేస్తారో చూశాం. రకరకాల బొమ్మలు ఎంతో ఆకట్టుకున్నాయి. కడెం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులను సందర్శించాం. బస్సుల్లో వివిధ పాటలపై నృత్యాలు చేశాం.

– వి.అనిత, 9వ తరగతి, గోయగాం

బయటి ప్రపంచం తెలియాలి



విద్యార్థులకు చదువుతో పాటు, బయట ప్రపంచం కూడా తెలియాలి. అందుకే పిల్లలను విహార యాత్రలకు తీ సుకెళ్లాం. ఎంతో ఉల్లాసంగా గడిపారు. ఇప్పటి వరకు సరస్వతి దేవి, ప్రాజెక్టులు, కొయ్యబొమ్మల గురించి పుస్తకాల్లో చదివారు. ప్రత్యక్షంగా చూశారు.

– ఎస్. రమేశ్, హెచ్‌ఎం, గోయగాం

‘భైరి నరేశ్‌ను కఠినంగా శిక్షించాలి’



ఫిర్యాదు చేస్తున్న అయ్యప్ప స్వాములు, స్థానికులు



రెబ్బెనలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న స్వాములు

సిర్పూర్(టి): అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భైరి నరేశ్‌పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో మండలంలోని అయ్యప్ప స్వాములు రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామితో పాటు హిందూ దేవుళ్లను కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన దుండగున్ని అరెస్టు చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వామి తులసీదాసు, ఉపసర్పంచ్ తోట మహేష్, బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్ములే శంకర్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసి హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించిన భైరి నరేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మండలంలోని అయ్యప్ప స్వాములు డిమాండ్ చేశారు. భైరి నరేష్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయ్యప్ప స్వాములు మునునూరి కిరణ్ శర్మ, పోటు శ్రీధర్‌రెడ్డి, గోలెం తిరుపతి, జిల్లాల స్వామి, రమేష్, తారాచంద్, శ్రీనివాస్, శ్రీనివాసులు, దిలీప్, మల్లేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

పీడీ యాక్టు నమోదు చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: భైరి నరేశ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాగజ్‌నగర్‌లో అయ్యప్ప స్వాములు ర్యాలీ నిర్వహించారు. అయ్యప్ప స్వాముల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కాగజ్‌నగర్ ఎస్‌హెచ్‌వో రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు.

కఠినంగా శిక్షించాలి

హిందూ సమాజాన్ని, అయ్యప్ప స్వామిని కించపరుస్తూ భైరి నరేశ్ సంభాషించారని, వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని సీనియర్ సిటిజన్ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ డిమాండ్ చేశారు.

కౌటాలలో..

కౌటాల: హిందూ దేవుళ్లను దూషించే వారిని కఠినంగా శిక్షించాలని భక్తులు అన్నారు. భైరి నరేశ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం అయ్యప్ప స్వాములతో పాటు హిందూ సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ తీశారు. అనంతరం కౌటాల -కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. సర్పంచ్ వొజ్జల మౌనిక్, ఎంపీటీసీ మనీష్, రాజేందర్‌గౌడ్, వెంకన్న, సత్తయ్య, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, మధుకర్, రమేష్, ప్రకాశ్ పాల్గొన్నారు.

ప్రజలు మూఢనమ్మకాలు వీడాలి



మాట్లాడుతున్న సీఐ బుద్దే స్వామి

కౌటాల: గ్రామీణ ప్రజలు మూఢనమ్మకాలను వీడాలని కౌటాల సీఐ బుద్దే స్వామి అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని వీర్దండి గ్రామంలో ధూంధాం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత నేరాలకు దూరంగా ఉండి జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రజలందరు ఐకమత్యంగా ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌటాల ఎస్సై ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ మడావి రేణుక, ఉపసర్పంచ్ బండు, పోలీసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్

రెబ్బెన: గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. మండలంలోని కొండపల్లిలో రూ. 5లక్షల జిల్లా పరిషత్ నిధులతో నిర్మాణం చేపట్టిన సైడ్ డ్రెయిన్ పనులతో పాటు, కైరిగాంలో రూ.7లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో చేపడుతున్న సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులను పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కార్తీక్, బీఆర్ఎస్ నాయకులు పోషం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపాలి

మండలంలోని రాంపూర్ వాగుపై చెక్‌డ్యాం నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ కోరారు. శనివారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి చెక్‌డ్యాం నిర్మాణానికి కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్ ఉన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

బెల్లంపల్లి: నెన్నెల మండలం బొప్పారం గ్రామానికి చెందిన ఓ నిరుపేద కుటుంబం అన్ని రకాల అనుమతులు తీసుకుని ఇంటి నిర్మాణం చేపడుతుంటే మండల తహసీల్దార్ అనవసరంగా వెళ్లి ఆ ఇంటి పిల్లర్లు పగుల గొట్టారని బీజేపీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజీ ఆరోపించారు. తహసీల్దార్ వ్యవహరించిన తీరుకు నిరసనగా శనివారం బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట బీజేపీ శ్రేణులు, బాధిత కుటుంబ సభ్యులు బైఠాయించి ధర్నా చేశారు.

ఈ సందర్భంగా ఏమాజీ మాట్లాడుతూ... బొప్పారం గ్రామానికి చెందిన నార పెంటక్క, తిరుపతి దంపతులు ఇంటి నిర్మాణానికి పూనుకోగా నెన్నెల తహసీల్దార్ అకారణంగా అక్కడికి వెళ్లి పిల్లర్లను పగుల గొట్టారని తెలిపారు. ఆ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

అనంతరం ఆర్డీవో శ్యామల దేవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లం తిరుపతి, అధికార ప్రతినిధి బి.హరీష్ గౌడ్, నాయకులు కేశవ రెడ్డి, రాజులాల్ యాదవ్, ప్రకాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. శనివారం పైకాజీనగర్‌లో పిచ్చి కుక్క దాడి చేసిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. బ్రాహ్మణవాడ, రావులవాడ, తేలివాడ, పొట్టిశ్రీరాములుచౌక్‌తో పాటు పలు ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది.

భక్తులకు పండ్లు పంపిణీ

కౌటాల: మంచిర్యాల జిల్లా నుంచి మహారాష్ట్రలోని చప్రాడ కార్తీక్ మహారాజ్ ఆలయానికి భక్తులు పాదయాత్ర చేపట్టారు. భక్తుల పాదయాత్ర శుక్రవారం రాత్రి కౌటాలకు చేరుకోవడంతో మండలంలోని గుడ్లబోరి గ్రామంలో స్థానిక హనుమాన్ ఆలయం కమిటీ సభ్యులు భక్తులకు ఉచితంగా అరటిపండ్లు పంపిణీ చేశారు. ఏటా మంచిర్యాల నుంచి తుమ్మిడిహెట్టి ప్రాణహిత నది మీదుగా చప్రాడకు పాదయాత్ర నిర్వహిస్తామని భక్తులు తెలిపారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామంలో ఆదివారం నుంచి పూలే సేవాసమితి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. పోటీలను ఏఎస్పీ అచ్చేశ్వరరావు, మాలి సంక్షేమ రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురే శ్యాంరావులు ప్రారంభిస్తారన్నారు. మొదటి బహుమతిగా రూ.12వేల నగదు, రెండో బహుమతిగా రూ. 8వేల నగదు అందజేస్తామని తెలిపారు.

సావిత్రిబాయి జయంతి ఘనంగా నిర్వహించాలి

చింతలమానెపల్లి: ఈనెల 3న సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాలలో ఘనంగా నిర్వహించాలని మాలి సంఘం మండల అధ్యక్షుడు నికోడే బాపురావు తెలిపారు. మండలంలోని డబ్బా గ్రామంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జయంతి సందర్భంగా మాలిసంఘం జెండాను ఆవిష్కరించి సావిత్రిబాయికి నివాళులర్పించాలని కోరారు. సమావేశంలో మాలిసంఘం నాయకులు గుర్లె శ్రీనివాస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప మహాపడిపూజ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం సాయంత్రం 6.00 గంటలకు బ్రాహ్మణ అర్చక పరిషత్ ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించనున్నట్లు అర్చకులు ముదిగొండ రాజశేఖర శర్మ తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని అయ్యప్ప దీక్షా స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

బెల్లంపల్లి: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయడమే కాదు ఉత్తమ సౌకర్యాలు కల్పించడంలోనూ తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) కళాశాల ముందంజలో ఉందని బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ అన్నారు. సంక్షేమ గురుకుల సీఓఈలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శనివారం విద్యార్థులకు పలు రకాల ఎనిమిటీస్ పంపిణీ చేశారు. విద్యార్థులు చక్కగా వినియోగించుకుని శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు.సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ షేక్ ఆస్మా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్త ఏడాది సంబరాలు



కౌటాల: పాఠశాలలో న్యూ ఇయర్ వేడుకలు



లేతన్‌గూడ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు



కెరమెరిలో కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు



తిర్యాణి: దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

కెరమెరి: మండలంలోని ఇందాపూర్, ఝరి ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఘనంగా నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎంలు రజిత, సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తు నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. లేతన్‌గూడ ప్రభుత్వ పాఠశాలతో పాటు పులికుంట కాలనీ పాఠశాలల్లో విద్యార్థులు కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. హెచ్‌ఎంలు రవికుమార్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని శ్యామ్ మోడల్ ప్రైవేట్ పాఠశాలలో శనివారం నూతన సంవత్సరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. మరోవైపు మండల వాసులు బేకరీల్లో కేకులు, దుకాణాల్లో ముగ్గుల రంగోలి కొనుగోలు చేస్తూ శనివారం ఉత్సాహంగా కనిపించారు.

ఆదివాసీలతో వేడుకలు..

తిర్యాణి: నూతన సంవత్సరం పురస్కరించుకుని శుభ సహాయ సర్వీస్ అనే స్వచ్ఛంద సంస్థ సభ్యులు వేడుకలను శనివారం మండలంలోని రోంపెల్లి పంచాయతీ పరిధిలోని కోలంగూడ గ్రామంలో నిర్వహించారు. గిరిజనులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నర్మద, సాయి, లక్ష్మి, శివాని, సురేశ్, మనోజ్ తదితరులు ఉన్నారు.